క్లుప్తంగా

కాశీవిశ్వేశ్వరుడికి వెండి నాగాభరణం అందజేత



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడులోని విశాలాక్ష్మి, అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ చైర్మన్ పి.వెంకటరెడ్డికి గుంటూరుకు చెందిన కె.భక్తవత్సలరెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతులు వెండి నాగాభరణం మంగళవారం అందజేశారు. ఆలయ అర్చకులు రావూరి పూర్ణానందశాస్త్రి, ఆంజనేయశాస్త్రి ఆశీర్వదం అందజేశారు.

రామాలయానికి శఠగోపం అందజేత



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని వైఎస్సార్ సెంటర్(కొత్తూరు)లో వేంచేసియున్న శ్రీ కోదండ సీతారామాలయం దేవస్థానానికి కళ్లం వెంకటరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరపున శఠగోపురాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కళ్లం రాజశేఖరరెడ్డి, ఆయన సతీమణి నాగమణి మాట్లాడుతూ తాడేపల్లి శ్రీ కోదండ సీతారామాలయంలో పూర్వకాలం నుంచి ఉన్న శఠగోపురం పాడవడంతో రూ.55 వేలతో కొత్త శఠగోపురం, వెండిపళ్లెం అందజేసినట్లు తెలిపారు. పూజారి శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్లం రాజశేఖరరెడ్డి దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, స్థానికులు మేకా అంజిరెడ్డి పాల్గొన్నారు.

తాడికొండ అడ్డరోడ్డు వద్ద నగదు స్వాధీనం

తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డు వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 1,63,500 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సిహెచ్.ప్రభాకర్ తెలిపారు. తాడికొండ శివారు బడేపురం గ్రామానికి చెందిన మద్దినేని సురేష్‌బాబు కారులో రూ.లక్ష, గుంటూరు పట్టణానికి చెందిన చిలకపాటి చతుర్వేది రూ.63,500 కారులో తీసుకుని వెళుతున్న సమయంలో తనిఖీల్లో పట్టుబడినట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదు ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు చెప్పారు.

ముస్లింలకు డ్రైఫ్రూట్స్ పంపిణీ

నిడుముక్కల (తాడికొండ): మండల పరిధిలోని నిడుముక్కల గ్రామంలో ముస్లింలకు సెమియా, డ్రైఫ్రూట్స్ వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల అధ్యక్షుడు బెజ్జం సాయిప్రసాద్, సర్పంచి మాదాసు రత్నకుమారి మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిడుముక్కల ఎంపీటీసీ బోడపాటి సుశీల, జిల్లా ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శి బి.వెంకటస్వామి, మాజీ ఉపసర్పంచ్ మాదాసు ఏసురత్నం, జిల్లా ఎస్సీసెల్ నాయకులు తోకల నరసింహారావు, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండరు ఆవిష్కరణ

తెనాలి: ఆచార్య ప్రబోదానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో రూపొందించిన త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండరు (త్రైత శకం–46)ను మంగళవారం తెనాలిలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరణ అనంతరం తెలుగు క్యాలెండరును తెనాలి డీఎస్పీ, త్రీటౌన్ పోలీస్ కార్యాలయంలో సిబ్బందికి అందజేశారు. ఆచార్య ప్రబోదానంద యోగీశ్వరులు రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి అందరికీ అర్థమయ్యేలా సరళమైన భాషలో రూపొందించినట్టు నిర్వాహకులు తెలియజేశారు. తెలుగు నెలలు అనుసరించేందుకు వీలుగా తెలుగు తిథులతో, ఆంగ్ల తేదీలతో కాల సూచికను తీసుకొచ్చినట్టు వివరించారు.

అలరించిన కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరీ



తెనాలిటౌన్: నెహ్రూరోడ్డులోని రుక్మిణి సత్యభామ సమేత గోవర్ధన స్వామి దేవాలయ ఆవరణలో క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా మంగళవారం రాత్రి సంగీత సద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరీ నిర్వహించారు. విజయవాడకు చెందిన శాంత బృందం సభ్యులు వివిధ వాగ్గేయ కరకృత్తులు(రామ పదమైన), కీర్తనలు గానం చేశారు. వయోలిన్‌పై చావాలి శ్రీనివాస్ (విజయవాడ), మృదంగంపై కెవి.రామకృష్ణ (తెనాలి) సహకరించారు. అనంతరం పంచాగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవా సమితి కన్వీనర్ రామకృష్ణ పర్యవేక్షించారు.

ఇంటింటా ఉగాది ఉషస్సులు

- శ్రీక్రోధినామ సంవత్సరాదికి స్వాగతం పలికిన ప్రజలు
- కళకళలాడిన దేవాలయాలు
- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు



ప్రత్తిపాడు రెడ్ల రామాలయం వద్ద పంచాంగ శ్రవణం ఆలకిస్తున్న ప్రజలు

ప్రత్తిపాడు: గ్రామగ్రామాన ఉగాది ఉషస్సులు నిండాయి. చేదు జ్ఞాపకాలకు వీడ్కోలు చెప్తూ, కొత్త ఆశలకు స్వాగతం పలుకుతూ తెలుగు ప్రజలు క్రోధి నామ సంవత్సరంలోనికి అడుగుపెట్టారు. ఉగాది సంబరాలను మంగళవారం అంగరంగ వైభవంగా జరుపుకొన్నారు. తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలను చెప్పుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఉదయాన్నే లేచి అభ్యంగన (తలంటు) స్నానం ఆచరించి, సనాతన తెలుగు సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడే పంచెకట్టు, పట్టు ఓణీ పరికిణీలతో నూతన వస్త్రాలను ధరించారు. ఇష్టదైవాన్ని స్మరించుకుని, షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని ప్రసాదంగా సేవించి పండుగను ప్రారంభించారు. అనంతరం క్రోధి నామ సంవత్సరంలో తమకు అష్ట ఐశ్వర్యాలు, భోగభాగ్యాలతో పాటు, ఈఏడాదైనా తమ కోరికలు నెరవేర్చాలని భక్తి ప్రపత్తులతో ఇష్టదైవాల ఆలయాలకు వెళ్లి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. పలు గ్రామాలలోని దేవాలయాలలో నిర్వహించే పంచాంగ శ్రవణాన్ని వినేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు విచ్చేశారు. తమకు ఈఏడాది ఎలా ఉంటుంది. తమ తమ వ్యయ, ఆదాయ వివరాలను తెలుసుకునేందుకు చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆలయాలకు రావడం విశేషం.

చేబ్రోలులో..

చేబ్రోలు: తెలుగువారి పండుగలలో అతి ముఖ్యమైన ఉగాది పండుగను చేబ్రోలు మండలంలో మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. చైత్ర మాసం శుక్లపక్షంలో పాడ్యమి తిథి నాడు వచ్చే ఉగాది పండుగను పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉత్సాహభరిత వాతవరణంలో జరుపుకొన్నారు. క్రోధి నామ సంవత్సర వేడుకలను ప్రధాన దేవాలయాలు, వివిధ చోట్ల ఘనంగా నిర్వహించారు. ఉగాది అంటే యుగాది అని యుగారంభం అని పెద్దలు చెబుతుంటారు. పండుగ పురస్కరించుకొని ప్రతి ఇంటా గుమ్మాలకు మామిడి తోరణాలతో అలంకరించారు.



చేబ్రోలు ఆదికేశవస్వామి దేవస్థానం వద్ద ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు

అన్ని ప్రముఖ దేవాలయాల్లో పండుగ సందర్భంగా పంచాంగ శ్రవణ పఠనం జరిగింది. చేబ్రోలులోని ఆదికేశవస్వామి, భీమేశ్వరస్వామి, చతుర్ముఖ బ్రహ్మ లింగేశ్వరస్వామి, రంగనాథస్వామి దేవస్థానాల్లో ఉగాది పండుగ సందర్భంగా కుందేటి నరసింహ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి, పంచాగ శ్రవణ పఠనం గావించారు. ఖ్యాతిగాంచిన చేబ్రోలులోని నాగేశ్వరస్వామి దేవస్థానంలో ఉగాది పండుగ సందర్భంగా సంస్కృత పండితులు నారాయణం శేషుబాబు ఆచార్యులు ద్వారా పంచాగ శ్రవణ పఠనం జరిగింది. చేబ్రోలు, నారాకోడూరు, వడ్లమూడి, శ్రీరంగపురం, శేకూరు, శలపాడు తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉగాది పచ్చడిని భక్తులకు అందజేసి పంచాగ శ్రవణంను వినిపించారు. చేబ్రోలులో జరిగిన కార్యక్రమంలో గ్రూపు దేవాలయాల అధికారి పోతుల రామ కోటేశ్వరరావు ఆయా చోట్ల అర్చక బృందం, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.




షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి

పెదకాకాని శివాలయంలో పంచాంగ శ్రవణం



పంచాంగ శ్రవణం చేస్తున్న పాపరాజు సాయిరామశాస్త్రి, పొత్తూరి సాంబశివరావు



గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులు

పెదకాకాని: ప్రజలందరికీ క్రోధి నామ సంవత్సరం అనుకూలంగా ఉంటుందని దేవస్థాన కృష్ణయజుర్వేద పారాయణదారు పాపరాజు సాయి రామశాస్త్రి అన్నారు. పెదకాకాని శివాలయంలో మంగళవారం క్రోధి నామ సంవత్సరం పురస్కరించుకుని భ్రమరాంబ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాలలో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం క్రోధి నామ సంవత్సరం, ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు పర్యవేక్షణలో విఘ్నేశ్వర పూజ నిర్వహించారు. క్రోధి నామ సంవత్సర రాశి ఫలితాలు, వర్షాభావ పరిస్థితులు, పాడి పంటలు, విద్య, వ్యాపార అనుకూలత వంటి అంశాలపై పంచాగ శ్రవణం చేశారు. పంచాంగ శ్రవణం అనంతరం భక్తులందరికీ క్రోధి నామ పంచాగం, ప్రసాదాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆలయ స్థానాచార్యుడు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకులు పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాద్, రుగ్వేద పారాయణదారులు వ్యాకరణం శ్రీలక్ష్మీగణపతి శర్మలను ఘనంగా సత్కరించారు.

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరినవారితో ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన మెచ్చి జనసేన నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరుతున్నారని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య తెలిపారు. మంగళవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామం నుంచి జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులు గాండ్ల వెంకటేశ్వరరావు, వికతి సువర్ణ రావు, ఇమ్మడబత్తిని ప్రసాదు, తుల్లవ హరివాసు, ఇమ్మడి పుల్లయ్య, ఇమ్మడబత్తిని అంకమ్మరావు, వికుర్తి వేణులతోపాటు 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. గుంటూరు రూరల్ మండలం జడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నేత తుమ్మల సుబ్బారావు ఆధ్వర్యంలో వీరు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల కాపు నాయకులు తోట నాగేశ్వరరావు, తంగేళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర సేవాదళ్ ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటప్పరెడ్డి, జిల్లా బీసీ నాయకులు పేరేచర్ల శివశంకర్, ఎస్సీసెల్ జిల్లా నాయకులు బత్తుల వెంకట్రావు, నరేష్ బందల పాటి తదితరులు పాల్గొన్నారు.

బలసాని సమక్షంలో చేరికలు...

జగనన్న సంక్షేమం సుపరిపాలన నచ్చి టీడీపీ, జనసేనలకు చెందిన కార్యకర్తలు భారీగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం వికాస్‌నగర్‌లోని ఎమ్మెల్యే అభ్యర్థి క్యాంపు కార్యాలయంలో వట్టిచెరుకూరు మండలం, వింజనంపాడు గ్రామం ఎస్టీ కాలనీ వాసులు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే అభ్యర్థి కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు.



వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన కార్యకర్తలతో పార్టీ ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య

రెండు గ్రామాల్లో ప్రచారం..

దేశం మొత్తం మన రాష్ట్రం వైపు చూసేవిధంగా జగనన్న పాలన చేశారని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజక వర్గ అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని లింగంగుంటపాలెం, వల్లూరు గ్రామాలలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివారావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

పొన్నూరు: మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిలుస్తాయని వైఎస్సార్ సీపీ పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని చాందినీ చౌక్ సెంటర్‌లో ముస్లిం మైనారిటీ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ మాసం సందర్భంగా నిర్వహించిన ఇఫ్తార్ విందుకు వైఎస్సార్ సీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, అంబటి మురళీకృష్ణలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థన నిర్వహించి ముస్లింలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ అల్లా చెప్పిన విధంగా తోటి వారిపై ప్రేమ, దయ, జాలి, కరుణ చూపిస్తూ, తోచిన సహాయ సహకారాలు చేయడం అన్నది ఆదర్శప్రాయ మార్గం అన్నారు. ఈ మంచి గుణం అందరిలోనూ ఉంటే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తుందన్నారు. అల్లా దివ్య ఆశీస్సులు మానవాళి అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు.



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న అంబటి మురళీకృష్ణ

రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ రూత్ రాణి, నాయకులు బడా గోరా, నన్న గోరా, అడితి మౌలాలి, వడ్రాణం ప్రసాద్, షేక్ నాజర్, వట్టిప్రోలు రంగారావు, బొద్దులూరి రంగారావు, అంబటి వెంకటేశ్వరరావు, అమిరినేని సాంబశివరావు, ఆకుల రామ్మోహన్, బోయి నాగరాజు, సయ్యద్ సుభాని, రుద్రపాటి ఆదిశేషులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులపాలిట కల్పవల్లి పోలేరమ్మతల్లి

నెహ్రూనగర్: భక్తుల పాలిట కల్పవల్లి, కోరిన కోర్కెలు తీర్చే కరుణామయి పోలేరమ్మ తల్లి అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు వెస్ట్ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. గుంటూరు అమరావతి రోడ్డు 49వ డివిజన్‌లోని కొండయ్య కాలనీ ఒకటో లైనులో ఉన్న లక్ష్మీ పోలేరమ్మ తల్లి దేవస్థానం మూడో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం మంత్రి రజిని ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం కమిటీ సభ్యులకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలేరమ్మ తల్లి మహిమ గల అమ్మవారని, భక్తులు నిండు విశ్వాసంతో, పవిత్ర హృదయంతో పూజలు చేస్తే, తప్పకుండా వారికి మంచి జరుగుతుందని తెలిపారు. అమ్మవారి చల్లని ఆశీస్సులతో ఈ ఏడాది అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నానన్నారు. ఆంధ్రప్రదేశ్ రజక ఐక్య సంఘాల వేదిక అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు, స్థానిక కార్పొరేటర్ బోడపాటి ఉషారాణి, 31వ డివిజన్ కార్పొరేటర్ అందుగుల సంతోష్, వైఎస్సార్ సీపీ నాయకులు బోడపాటి కిషోర్, వంగల వలివీరారెడ్డి, అన్నదానం సత్రం డైరెక్టర్ రవీందర్, పార్టీ నాయకులు పోకల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు అరవింద్, సత్య, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి విడదల రజిని

మహిమాన్వితం నిదానంపాటి అమ్మవారి చరితం..

నెహ్రూ నగర్: సాక్షాత్తు పార్వతీదేవి అవతారమైన నిదానంపాటి శ్రీలక్ష్మీదేవి అమ్మవారు ఎంతో మహిమాన్వితురాలని, ఆమెను పూజిస్తే సంతాన భాగ్యంతో పాటు, సకల సంపదలు ఒనగూరుతాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు వెస్ట్ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. గుంటూరు నల్లకుంట 12వ లైనులో ఉన్న త్రిశక్తి నిదానంపాటి అమ్మవారి ఆలయంలో ఉత్సవాలకు మంత్రి రజిని హాజరయ్యారు. ఈ ఆలయంలో ప్రతి ఏడాది ఉగాది నాడు కలశ పూజ నిర్వహిస్తారు. అందులో భాగంగా మంగళవారం 101 మంది మహిళలు కలశాలు నెత్తిన పెట్టుకుని నల్లకుంట ప్రధాన వీధుల్లో ఊరేగింపు జరిపారు. అనంతరం ఆలయానికి చేరుకున్నారు. ఈ ఉత్సవాలకు హాజరైన మంత్రి రజిని కొబ్బరికాయ కొట్టి కలశాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రత్తిపాడు: ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పోలీసుశాఖ ముమ్మర చర్యలు తీసుకుంటుంది. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రత్తిపాడు ఎస్ఐ వి.సోమేశ్వరరావు ఆధ్వర్యంలో సమస్యాత్మక గ్రామాలైన ప్రత్తిపాడు, పాతమల్లాయపాలెం ఎస్సీ కాలనీ, తిమ్మాపురం గ్రామాల్లో సాయుధ సీఆర్‌పీఎఫ్ పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించుకునేలా ప్రజలు సహకరించాలని ఎస్ఐ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న టిప్పర్

ఒకరి మృతి

మేడికొండూరు: ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వచ్చిన క్రషర్ టిప్పర్ బలంగా ఢీకొంది. ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన పేరేచర్ల డొంకలో మంగళవారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని డోగిపర్రు గ్రామానికి చెందిన ఉడతా బుల్లివెంకయ్య, స్నేహితుడు మొక్కల బ్రహ్మయ్య ద్విచక్ర వాహనంపై చేబ్రోలు మండలం అనంతారం వెళ్లి తిరిగి ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యలో పేరేచర్ల డొంక వద్దకు రాగానే వెనుకగా వచ్చిన క్రషర్ టిప్పర్ లారీ బలంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ఉడతా బుల్లి వెంకయ్య(33) రోడ్డుపై పడడంతో లారీ అతడిపైగా వెళ్లడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకుని ఘటనా స్థలానికి చేరుకున్న మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. బ్రహ్మయ్యకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.



మృతిచెందిన ఉడతా బుల్లి వెంకయ్య

కుయ్..కుయ్.. రయ్..రయ్!

కొద్దిరోజుల పెదనందిపాడు మండలంలోని చిననందిపాడులో వ్యవసాయ పనులకు వెళ్లిన మహిళా కూలీలపై పొలంలోని పురుగు మందు అవశేషాల ప్రభావం పడింది. సుమారు పాతికమందికి పైగా కూలీలు తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. ఆందోళనకు గురైన స్థానికులు 108కు ఫోన్ చేశారు. అంతే నిమిషాల వ్యవధిలో ఇటు ప్రత్తిపాడు మండలం నుంచి అటు చిలకలూరిపేట నుంచి మరోవైపు పర్చూరు నుంచి నిమిషాల వ్యవధిలో ఐదు 108 వాహనాలు కుయ్ కుయ్ కుయ్ అంటూ ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అస్వస్థతకు గురైన వారిలో కొందరికి అక్కడికక్కడే అత్యవసర చికిత్సను అందించి అందించి, మరింత మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సకాలంలో వాహనాలు రావడంతో పెద్ద పెను ప్రమాదం తప్పింది.

- 108 వాహనం ద్వారా ప్రజలకు విస్తృత సేవలు
- ఫోన్ చేసిన నిమిషాల్లోనే ఘటనా స్థలికి దూసుకొస్తున్న అంబులెన్స్
- క్షతగాత్రులు, బాధితులకు కొండత బాసట
- చంద్రబాబు హయాంలో 108 వాహనాలకు దుర్గతి
- పునర్జీవం అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు

ప్రత్తిపాడు: 108 అంబులెన్స్ ద్వారా ప్రాణాలు కాపాడిన సందర్భాలు ఎన్నెన్నో. అది ప్రమాదమైనా, పెను విపత్తయినా, అఘాయిత్యమైనా, అత్యవసరమైనా.. బాధితులను, రోగులను ఆస్పత్రులకు తరలించడంలో 108 సేవలు మాటల్లో చెప్పలేనివి. వేల మందిని సకాలంలో ఆస్పత్రులకు తరలించి ప్రాణాలను కాపాడటంతో పాటు అక్కడికక్కడే ప్రాథమిక చికిత్స అందించడంలో 108 వాహనం, సిబ్బంది పాత్ర అనిర్వచనీయం. ఫోన్ మోగితే చాలు.. కుయ్ కుయ్ కుయ్ అంటూ వాయువేగంతో నిమిషాలు, క్షణాల్లో ఘటనా స్థలికి చేరి బాధితులకు బాసటగా నిలుస్తుంది. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పురుడుపోసుకున్న 108 వాహనాలు ఎందరికో ప్రాణభిక్షను పెట్టాయి.



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న 108 వాహనం

ఆపద్బాంధవిలకు పునర్జీవం ..

కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారింది. 2019లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోనికి వచ్చిన తరువాత 108 వాహనాలకు జీవం పోశారు. 108 వాహనాలపై దృష్టి కేంద్రీకరించారు. కోట్ల రూపాయలు వెచ్చించి అధునాతన 108 వాహనాలను కేటాయించారు. ఫోన్ చేసిన నిమిషాల వ్యవధిలోనే బాధితులకు 108 సేవలు నిరంతరాయంగా అందుతున్నాయి. అర్ధరాత్రి వేళల్లోనూ క్షణాల వ్యవధిలో బాధితులకు అత్యవసర సాయం అందుతోంది.

మండలానికొకటి చొప్పున..

నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాలకు గాను ఒక్కో మండలానికి ఒక్కో నూతన 108ను కేటాయించారు. వీటిద్వారా నియోజకవర్గంలోని 96 గ్రామాల ప్రజలకు విస్తృత సేవలు ఆపత్కాలంలో అందుతున్నాయి. గర్భిణులు, గుండెపోటు, ప్రమాద బాధితులు, క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడేవారు, అర్ధరాత్రి వేళ విషసర్పాల కాటుకు గురయ్యేవారు. ఇలా ఎందరికో వాహనాల ద్వారా సేవలందిస్తున్నారు.

ఏడాది కాలంలో అందించిన సేవల వివరాలు..

2023 జనవరి నుంచి 2024 మార్చి వరకు నియోజకవర్గంలోని కాకుమాను, పెదనందిపాడు, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు మండలాల్లో మొత్తం 6,626 మందికి 108 వాహనాల ద్వారా అత్యవసర సేవలు అందించారు. గర్భిణులకు సంబంధించి 751, ఆర్‌టీఏ కేసులు 762, డయాలసిస్ రోగులకు 834, ఇతరులు 4,579 మందికి సేవలందాయి.

చంద్రబాబు హయాంలో మూలన..

108 వాహనాలకు చంద్రబాబు ప్రభుత్వ హయాంలో దుర్గతి పట్టింది. వాహనాల బాగోగులు పట్టించుకోకపోవడంతో మార్గమధ్యలో ఎక్కడ ఆగిపోతాయో, ఎప్పుడు మొండికేస్తాయో తెలియని పరిస్థితి చోటుచేసుకుంది. అంతేకాకుండా నియోజకవర్గానికి ఒక వాహనం మాత్రమే ఉండటం, అది కూడా ఎక్కడ నిలిపి ఉంటుందో, ఎప్పుడు, ఏ సమయానికి వస్తుందో తెలియని పరిస్థితి ఉండేది. రోజుల తరబడి దవాఖానాల ముంగిట 108 వాహనాలు మొరాయించి మూలకు చేరి కనిపించేవి. ఇక మారుమూల ప్రాంతాల ప్రజలైతే అర్ధరాత్రి అత్యవసర వేళల్లో స్థానిక ప్రైవేట్ వాహనాలే దిక్కయ్యేవి. ఆటోవాలాల ఇంటి తలుపులు కొట్టి ఆస్పత్రులకు తీసుకువెళ్లమని ప్రాధేయపడాల్సి వచ్చేది.

వైభవంగా అంకమ్మతల్లి ప్రతిష్ఠా మహోత్సవాలు

స్వామి వార్లకు, గ్రామదేవతలకు నూతన వస్త్రాలు



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో పునర్నిర్మించిన అంకమ్మతల్లి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పన్నెండవ తేదీ వరకు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా తొలి రోజైన మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు ప్రత్తిపాడులో కొలువుదీరిన దేవతామూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. సుప్రసిద్ధ గంగా పార్వతీ సమేత దండేశ్వారాలయంలో, వేణుగోపాల, సీతారామస్వామివార్ల దేవాలయం, విఘ్నేశ్వరాలయం, మళయాల పరమేశ్వరస్వామి దేవస్థానం, రామాలయాలతో పాటు గ్రామదేవతలకు, అమ్మవార్లకు, తాంబూల సహిత నూతన వస్త్రాలను స్వామివార్లకు, అమ్మవార్లకు సమర్పించారు. ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.